క్లుప్తంగా

వేకువ చుక్క పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ హాల్‌లో ప్రముఖ బాలల రచయిత గద్వాల సోమన్న రచించిన వేకువ చుక్క పుస్తకాన్ని ఆదివారం డాక్టర్ టి.సేవాకుమార్ ఆవిష్కరించారు. సీనియర్ సిటిజెన్ పలకలూరి శివరావుకు అంకితమిచ్చారు. అనంతరం గద్వాల సోమన్న, పలకలూరి శివరావులను సత్కరించారు. కార్యక్రమంలో రచయిత సయ్యద్ జానీ బాషా, ఆయుర్వేద వైద్యులు అల్లాడి శ్రీనివాసరావు, విద్యావేత్త శాంతకుమార్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అలరించిన వేణుగానం, గాత్ర కచేరి




నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై ఆదివారం వేణుగానం, గాత్ర కచేరి నిర్వహించారు. స్వర తరంగిణి విద్యాలయం(గుంటూరు) ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలకమండలి, సంస్థ నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీమారెళ్ళ వామనకుమార్ పలు కీర్తనలను వేణుగానంతో పలికించారు. ప్రేక్షకులను అలరించాయి. సువర్ణవిద్య శిష్య బృందం వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై చావలి కృష్ణమోహన్ వాయిద్యాన్ని అందించారు.

మెగా కంటి వైద్య శిబిరం

లక్ష్మీపురం: దివంగత సిహెచ్.హరిబాబు స్మారక కేంద్రం పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం మంచి విషయమని ప్రొఫెసర్ ఎం.వి.ఎస్.కోటేశ్వరరావు, మెమోరియల్ స్కూల్ అడ్మినిస్ట్రేటర్ ఎల్.ఎస్.భారవి పేర్కొన్నారు. గుంటూరు 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో సిహెచ్.హరిబాబు స్మారక కేంద్రం ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుప్రియా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కె. నళినీకాంత్, షేక్ మస్తాన్ వలి, కె.ఆంజనేయులు, నాయుడు పద్మ, తరుణ్ సింగ్, కె.సుజాత, ఎండీ ముస్తాక్ అహ్మద్, ఎస్.పద్మనాభుడు, ఎం.అచ్యుత కుమారి, పి.మురళి పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడే సమస్యలకు మూలం



లక్ష్మీపురం: మనం సహజంగా కొన్ని విషయాలు మర్చిపోవడం మానవుని సహజ లక్షణమని కొంత సమయం తర్వాత తిరిగి గుర్తొస్తుందని ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో వరల్డ్ అల్జీమర్స్ డే సందర్భంగా ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. అల్జీమర్స్ తో బాధపడే వారికి రెమిన్సెస్ థెరపి, ఆర్ట్ థెరపి, మ్యూజిక్ థెరపి వంటి విధానాలలో కూడా చికిత్స చేసేందుకు ప్రయత్నం చేయవచ్చు అన్నారు. అనంతరం ప్రముఖ సైక్రియాటిస్ట్ సురేష్ కుమార్‌ను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. సభకు కోఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, విశ్రాంత ఉపాధ్యాయుడు ఏవీ రామారావు, ఉమాపతి రెడ్డి ప్రసంగించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి 10.30 గంటల వరకు 0863–234202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ డిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భయం గుప్పిట్లో శివారు కాలనీలు

- చిన్నపాటి వర్షానికే తటాకాన్ని తలపిస్తున్న ఆయా ప్రాంతాలు
- మురుగునీరు నిల్వతో రోగాల బారిన ప్రజలు
- ఫలించని అధికారుల తాత్కాలిక చర్యలు



ఆయా ప్రాంతాల్లో నివాసాల మధ్య నిలిచిన వర్షం నీరు



ప్రగతినగర్ ఇళ్ల మధ్య చేరిన వర్షంనీరు

పట్నంబజారు: నగరంలోని శివారు కాలనీలు భయం గుప్పిట్లో అల్లాడుతున్నాయి. నగరాన్ని డయేరియా, మరొక వైపు ఎడతెరపిలేని వర్షాలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. సమస్యలు చుట్టుముట్టాయి. కురుస్తున్న వర్షాలకు కాలనీల్లో నీరు చేరుతోంది. రోడ్లు మునిగిపోతున్నాయి. పల్లం ప్రాంతంలో ఇళ్లు నీటమునిగాయి. కార్పొరేషన్ అధికారులు చేపడుతున్న తాత్కాలిక చర్యలు ఉపశమనం ఇవ్వలేకపోతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఎక్కడెక్కడంటే...

పాతగుంటూరు పరిధిలోని లక్ష్మీనగర్, దుర్గానగర్, సుద్దపల్లిడొంక, యానాది కాలనీ, ప్రగతినగర్, ఆనందపేట, హుస్సేన్‌నగర్, చంద్రబాబునాయుడు కాలనీ, నందివెలుగు రోడ్డు, రాజీవ్‌గృహకల్ప సముదాయం ప్రాంతాలు కొద్దిపాటి వర్షానికే జలమయంగా మారుతున్నాయి. నివాసాల్లోకి నీరు చేరి తటాకాన్ని తలపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వీధి లైట్లు వెలగక, గుంతల్లో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన ప్రజలు పడుతున్నారు. దీనికి తోడు సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో విషజ్వరాలు వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా యానాది కాలనీలో సుమారు 50 కుటుంబాలకు పైగా జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో నిలించిన వర్షంనీరు, భారీగా మొలిచిన పిచ్చిమొక్కలను ఫొటోలు తీసి కార్పొరేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

మురుగునీటితో ఇబ్బందులు

ముగురునీరు తాగునీటితో కలుషితమై సరఫరా అవుతుండటంతో ప్రజలు డయేరియా బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా ఆనందపేట పరిసర ప్రాంతాల్లో మురుగునీరు తాగునీటి కలుషితమై సరఫరా అవుతుందని స్థానికులు వీడియో తీసి నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేకుండా పోయిందని, దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్గానగర్, యానాది కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మురుగునీరు తాగునీటితో కలుషితమవడంతో ఆ ప్రాంతంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రోగాల బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సమస్యలు మరింత జటిలం కాక ముందే ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వీడాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చిన్నారులకు జ్వరం



గత వారం రోజులుగా మా కుటుంబంలో చిన్నారులంతా జ్వరం బారిన పడ్డారు. ఖాళీ స్థలాలు, వర్షంనీటి నిల్వలతో దోమలు పెరిగిపోయి చిన్నారులు రోగాల బారిన పడుతున్నారు. కనీసం శానిటేషన్ సిబ్బంది ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. మురుగు కాలువల్లో పూడిక తీయించి శుభ్రం చేయాలి. చెత్త నిల్వలు పేరుకు పోతున్నాయి. భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది.

– షేక్ కాలేషా, యానాదికాలనీ

నీళ్లలోనే జీవనం సాగిస్తున్నాం



వర్షం పడితే చాలు నివాసాల్లోకి నీరు చేరుతోంది. ఎన్ని సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాన పడితే చాలు అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాం. పేద కాలనీలపై ప్రజాప్రతినిధులు, అధికారులు కనీస జాలి లేకుండా పోయింది. ఇలాగే వ్యవహరిస్తే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని భావించాల్సి వస్తుంది.

– కోడూరి సమాధానం, ప్రగతినగర్

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

- 4.10 కిలోలు స్వాధీనం
- వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు



లక్ష్మీపురం: గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసి, వీరి నుంచి 4.10 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి సీఐ గంగా వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన రవీంద్ర కుమార్ ప్రస్తుతం హౌసింగ్ బోర్డులో ఉంటూ మిర్చి యార్డులో పనిచేస్తున్నాడు. గంజాయిని విక్రయించి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో భార్య రాణి దేవితో బిహార్ రాష్ట్రం నుంచి గంజాయిని తెప్పించి గుంటూరు నగరంలో పరిసర ప్రాంతాలలో గంజాయి తాగే వారి అమ్మి డబ్బులు సంపాదించుకుందాని అనుకున్నాడు. రెండు రోజుల క్రితం భార్య రాణి దేవితో 4 కిలోల గంజాయి తీసుకురాగా దానిని తీసుకుని శ్యామలనగర్ రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రోడ్డులో ఉంటున్న ధరంవీర్, షేక్ మొహమ్మద్‌లకు విక్రయించి డబ్బు తీసుకునే క్రమంలో పట్టుబడ్డారు. ధరంవీర్ ప్రస్తుతం శ్రీనివాసరావుపేట 9వ లైన్‌లో నివాసం ఉంటుండగా షేక్ మొహమ్మద్ దాసరిపాలెం ఉంటున్నాడు. గంజాయితో పాటు రూ.400 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు రామాంజనేయులు, ఆంథోని ఉన్నారు.

శ్రేష్ట హాస్పిటల్స్‌కు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ గొట్టిపాటి నాగార్జున, డాక్టర్ యడ్లపల్లి సుష్మిత

గుంటూరు మెడికల్: గుంటూరు శ్రేష్ట హాస్పిటల్స్ ప్రతిష్టాత్మక టైమ్స్ ఆఫ్ ఇండియా అవార్డ్స్–2025లో రెండు ప్రత్యేక అవార్డులు సొంతం చేసుకుంది. శ్రేష్ట హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సుష్మిత, ఎమర్జింగ్ లీడర్ ఇన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అవార్డు అందుకున్నారు. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున సర్వీస్ ఎక్సలెన్స్ ఇన్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ అవార్డు అందుకున్నారు. డాక్టర్ యడ్లపల్లి సుబ్బారావు, డాక్టర్ లక్ష్మణ స్వామి, డాక్టర్ సుష్మిత మూడు తరాల వైద్య వారసత్వంతో కూడిన శ్రేష్ట హాస్పిటల్స్ గుంటూరులో విశ్వసనీయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిలుస్తోంది.

నేటి నుంచి దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని ఆలయాలు దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలకు సిద్ధమయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి వైభవంగా ప్రారంభమయ్యే ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. 11 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. దేవాలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేయనున్నారు. పాతగుంటూరు, మంగళగిరి రోడ్డు, బ్రాడీపేట, జూట్‌మిల్ ఏరియా, కోబాల్డుపేట, దేవాపురం తదితర ఏరియాల్లో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి, ప్రత్యేక అలంకారాలతో పూజలు చేయనున్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో..

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 రోజులపాటు ప్రతి రోజు అమ్మవారి అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, పారాయణాలతోపాటు విశేష హోమాలు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన తెలిపారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పార్టీ నేతలు

గుంటూరు మెడికల్: జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నమో యువ రన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ర్యాలీ స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిసా విగ్రహం వరకు నిర్వహించారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ భారత దేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తెస్తున్న మోదీకి అభినందనలు తెలిపారు. ఈనాటి యువత డ్రగ్స్ కు బానిసలు అయ్యి వారి జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా వారి జీవితంలో వచ్చే మార్పుల వల్ల భావి జీవితాన్ని కోల్పోయే పరిస్థితి జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తులను చూసి వారి తల్లిదండ్రులు కూడా ఎంతో మానసిక వేదనకు గురి అవుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మత్తు పదార్థాలపై నిషేధం చేస్తూ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివన్నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువత మత్తుకి బానిసలుగా మారి వారి జీవితాన్ని నాశనం చేసుకుంటూ, కుటుంబాన్ని కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికోసం 14446 అనే టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి బిడ్డల భవిష్యత్ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన పక్షోత్సవాలలో భాగంగా సమాజ హితమే దేశ హితంగా ఈనాటి యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మైలా హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్, చల్లా కౌశిక్ ,జిల్లా ఉపాధ్యక్షులు చిలకా బాలకోటయ్య, రామిశెట్టి గోపి, ఏక్కల సాయి, జిల్లా కార్యదర్శులు ఈశ్వర్ గౌడ్, రాజా, సాయి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివన్నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జిల్లా సేవా పక్వాడ కన్వీనర్ కుమార్ గౌడ్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, ఈదర శ్రీనివాసరెడ్డి, టివి రావు, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, సురేష్ జైన్, తానుచింతల అనిల్ పాల్గొన్నారు.

గురజాడ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



లక్ష్మీపురం: మహాకవి గురజాడ అప్పారావు సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గురజాడ తన జీవితాంతం మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలు, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. విద్యార్థులు, యువతలో దేశ భక్తిని, సామాజిక చైతన్యాన్ని కలిగించే రచనలు చేశారన్నారు. గురజాడ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది కవులు, కళాకారులకు పురస్కారాలు అందించాలని, పాఠశాలలు, కళాశాలల్లో గురజాడ దేశభక్తి గేయాలను ప్రతి రోజు పాడించాలని, పాఠ్యపుస్తకాలపై దేశభక్తి గేయాలను ముద్రించాలని డిమాండ్ చేశారు. గుంటూరు రచయితల సంఘం జిల్లా నాయకులు సుభాని మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితుల్లో గురజాడ సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని కోరారు. సి.ఐ.టి.యు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడారు. అనంతరం గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఎస్.భావన్నారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు పద్మ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ. చిష్టీ, సి.ఐ.టి.యు.జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్, ఎస్.ఎఫ్.ఐ. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.కిరణ్, కె.పి.పి.ఎస్. జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వై.కమాలాకర్, జె.నవీన్ ప్రకాష్ పాల్గొని నివాళులర్పించారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

నెహ్రూనగర్: నగరంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. అరండల్‌పేట 5వ లైనులో చెట్టు పడిపోయింది. శారదాకాలనీ 25వ లైనులో విద్యుత్ వైరు తెగి కింద పడింది.

సేవా సంస్థల కృషి అభినందనీయం



సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు సహాయ సహకారాలు అందించడంలో స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయమని బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య అన్నారు. డీఎస్ కల్యాణ మందిరం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దేవస్థానం ఆవరణలో పది స్వచ్ఛంద సంస్థలకు రూ.5 లక్షలు ఖరీదు చేసే యాభై సైకిళ్లు, పడక మంచాలు, అంధ విద్యార్థులకు ఆడియో, వీడియో రికార్డులు, రీడింగ్, రైటింగ్ ప్యాడ్స్, 256 జీబీ పెన్ డ్రైవ్స్, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కల్యాణ మందిరం నిర్వాహకుల్లో ఒకరైన డోగిపర్తి శివమోహన్ మాట్లాడుతూ ఐదు తరాల బాంధవ్యాలను కాపాడుకుంటూ ఒకే మాటపై ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కల్యాణ మందిరం ద్వారా వచ్చే ఆదాయంలో ఎనభై శాతం సేవా కార్యక్రమాలకు వినియోగించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. పదేళ్లుగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పలు స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డోగిపర్తి అనంతసాంబశివరావు, డీవీ సాంబశివరావు, డోగిపర్తి సుబ్బారావు, రామకృష్ణ, ఆలపాటి ప్రసాద్, సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, డోగిపర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన

లక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరుద్యోగుల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి పిలుపునిచ్చారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ భర్తీ ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా మెడికల్ కాలేజీల సీట్లు 50 శాతం జగన్ ప్రభుత్వం అమ్ముకుంటున్నారని, మేము అధికారంలోకి రాగానే 100 రోజుల్లో జీఓ 107, 108ని రద్దు చేస్తామని చెప్పిన లోకేష్ ఇప్పుడు ఎందుకు ప్రయివేటీకరణ చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పది మాసాలైనా ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు.